ఉన్నారనుకో, ఆ విగ్రహాలు, చెక్కే శిల్పికి ఎన్టీ ఆర్‌గారు ఆయా సినిమాల్లోని స్టిల్స్ ఇవ్వకుండా వుంటారా?"

"ఏమో. నీ థియరీ నాకు నచ్చలేదురా."

"ఆ మధ్య తమిళనాడులో ఒక ప్రముఖుడు ఒక దేవత విగ్రహం పెట్టించినప్పుడు ఆ శిల్పిగారు ఆ నాయకుడి భార్యరూపం ఆధారంగా ఆ విగ్రహం చెక్కేడట, శిల్పి. దాంతో పెద్ద గొడవైపోయి, ఆ విగ్రహం పడగొట్టించే దాకా వూరుకోలేదు, జనం!"

"ఓరి నీ అసాధ్యం కూలా!" అన్నాను.

"మనకి ఆ భయం లేదులే, విగ్రహాలు పెట్టించడం ఎంత కష్టమో వాట్ని పడగొట్టించడం యింకా కష్టం" అన్నాడు మా మేనల్లుడు.

"అవును కాబోలు..." అన్నాను.

"అందుకే అన్నారు మనవాళ్ళు; నైవేద్య నష్టి, విగ్రహపుష్టి-అని! నా పనీ అలాగే అయింది లే."

"అదేమిటి ఆ మాట?"

"అదంతే, వాళ్ళు నాకు ఉద్యోగం యివ్వడం లేదు!" ★

# 97. విషాదపట్నం ఆటోకాండ

**మా** మోహనరావుకి విశాఖపట్నం కేంపు తగిలినప్పుడల్లా ముందుగా నాకు ఉత్తరం రాస్తూ ఉంటాడు. సందర్భాన్ని బట్టి ఒక టాక్సీ బుక్ చెయ్యమనీ, ఎవరిదైనా స్కూటరు అడిగి మనింటి దగ్గరుంచమనీ రాసేవాడు. నేను స్కూటర్ కొన్నాక ఏకంగా నన్ను సెలవు పెట్టేసి ఇంటి దగ్గరుండిపోమనడం ప్రారంభించేడు. ఇప్పుడతనికి స్కూటరూ డ్రైవరూ కూడా "ఫ్రీ" కదా. ఓ సారి అతను ఒస్తానన్న రోజుకి నా స్కూటరు వర్క్‌షాపులో ఉండిపోయింది. ఆ సంగతి తెలియక దిగినవాడు నా స్కూటర్ కోసం మా ఇంటికి వచ్చి ఆశాభంగం చెందుతాడని, ముందు జాగ్రత్త చర్యగా నేను అతను రైలు దిగే వేళకి స్టేషన్‌కెళ్లాను. అదుగో, అప్పట్నుంచే మా మోహనరావుకి ఆటోలు అలవాటయ్యాయి, ఈ వూళ్ళో.

మా మోహనరావు ఆటోల వాళ్ళతో జరిపే సంభాషణ చాలా చమత్కారంగా వుంటుంది.

రైలు దిగి ఓ చేత్తో సూట్‌కేసు పట్టుకుని మోహనరావు ఇవతలికొస్తాడు కదా.

"ఆటో, సార్?" అని ఎవరో పలకరిస్తారు.

"ఏదీ, ఏదీ?" అని బెదిరిపోయి పక్కకి తప్పుకుంటాడు మోహనరావు.

"బలేవారే సార్, ఆటో కావాలాని అడుగుతున్నాం!"

"ఏరీ, ఏరీ?"

"ఎవరండీ?"

"అడుగుతున్నాం- అన్నారు కదా. మిగిలిన వాళ్ళు ఏరీ?"

అడిగిన మనిషి చల్లగా జారుకుంటాడు.

నాలుగడుగులు నడవగానే ఇంకొకడొస్తాడు.

"ఆటోసార్."

"థాంక్యు. ఎక్కడుంది మన బండి?"

"అల్లదిగో సార్. ఎక్కడికండి?"

"అప్సరా హోటలుకి."

"పదహారు రూపాయలు సార్."

"అదికాదు, ఆటోకి మీటరో ఏదో వుంటుంది కదా?"

"మీటరు పని చెయ్యడం లేదు సార్."

"మీటరే పనిచెయ్యకపోతే ఇంజనూ, కార్బురేటరూ, సైలెన్సరూ ఇవన్నీ ఎలా పనిచేస్తాయి?"

"పన్నెండివ్వండి సార్."

"ఛీ అంత అన్యాయం చేసేవాళ్లా కనిపిస్తున్నానా? ఇదుగో చూడు, సింహాద్రప్పన్న మీద వొట్టు! మీటరు వెయ్యి, అందులో ముప్ఫయి రూపాయలు చూపెట్టినా సరే అంతా ఇచ్చేస్తాను."

"ఏటి సార్, పెద్దవారు తమరలా మాట్లాడతారు? పెట్రోలు ధర్లు పెరిగిపోయాయండి. గల్ఫ్‌లో యుద్ధం వచ్చేస్తుందండి."

"అలాగా!? వెధవది నా మట్టి బుర్రకి తెలియదు. పేపరు చదవడం రాదు; ఆఖరికి టీవీ చూడ్డమయినా రాదు..."

అతను కూడా వెళ్ళిపోడానికి సిద్ధం అవుతుంటాడు. మోహన్రావు సంభాషణ మొదలు పెడతాడు. 'మొన్న హైద్రాబాద్‌లో ఏమైందో తెలుసా?" అని అతనితోటే ప్రారంభిస్తాడు ఆ సంభాషణ. 'ఏమైంది', అని ఎవరూ అడగరు. "పెట్రోలు ధరలు పెరిగిపోయాయని, హైద్రాబాద్‌లో యాభై ఇద్దరు ఆటో డ్రైవర్లు ఆటోలు తిప్పడం మానేసి, సెక్రెటేరియట్ దగ్గరా, టాంకుబండు మీదా అడుక్కుతినడం మొదలెట్టేరు."

ఆటో కావాలా - అని అడిగిన పెద్ద మనిషి "మాటలు జాగర్తగా రానియ్యండి సార్!" అని వెళ్లిపోతాడు.

ఇతను నిజంగా ఆటో ఎక్కేవాడే కాని బేరం కుదర్లేనట్టుందని అనుకొని ఇంకొకడొస్తాడు, ఆటో డ్రయివు చేసుకుంటూ.

"ఆటోసార్?"

"అప్సరాకి వెళ్లాలి" అని సూట్‌కేసుతో సహా ఎక్కిపోయినంత ఆదుర్దా చూపిస్తాడు మోహన్‌రావు. "మీటరు మీద రెండ్రూపాయలు సార్" అంటాడు అతను.

"మాట తప్పవుకదా?"

"మాట తప్పడమేంటండీ?"

"అదే, తీరా అప్సరా దాకా వెళ్లేక నేను ఒక రెండ్రూపాయల నోటు తీసి నీ మీటరుమీద పెట్టేసి దిగిపోతాను. అప్పుడు గొడవచెయ్యకూడదు మరి."

ఆటో తుర్రుమని మళ్ళీ ఇందాక వుండే స్థలానికి వెళ్లిపోతుంది.

ఇంకొక ఆటో వస్తుంది.

"అప్సరాకి వెళ్లాలి."

డ్రయివరు మీటరు గిర్‌మనిపించి “ఎక్కండి” అంటాడు.

“ఏమిటి, మీటరు ప్రకారం వచ్చెయ్యడమే?” అని ఆశ్చర్యం ప్రకటిస్తాడు మోహనరావు.

“మీటరు మీద ఎల్లకపోతే మరి మీటర్లెందుకండీ, ఏసుకోడం?”

“అయ్యబాబో, అయితే నేను రాను, మీటరు ప్రకారం ఆటో వస్తుందంటే దాంట్లో ఏదో వుందన్నమాటే” అని మోహనరావు పక్కకొచ్చేస్తాడు.

“అంటే, మీటరు వర్కింగు తప్పు వుంటుందంటావా?” అని నేను అడిగితే -

“ఆ మాట వేరే చెప్పాలా? క్రితం సారి నేనొచ్చినప్పుడు ఆర్టీసీ కాంప్లెక్సుకి ఆటోలో వెళ్లాను, తీరా దిగేటప్పుడు చూస్తే ఏకంగా తొమ్మిది రూపాయలైంది” అని చెప్తాడు మోహనరావు.

“నీదంతా విడ్డూరం!” అంటాను నేను.

“లేదు! మీ వూళ్లో ఇంకా ఆటో కల్చర్ రాలేదు. మద్రాసులోనూ, బెంగుళూరులోను ఇంజన్లు వెనకాల వున్న ఆటోలు వుంటాయి. మనం కబుర్లు చెప్పుకుంటూ వెళ్లొచ్చు నెమ్మదిగా. ఇక్కడ కుదుపూ శబ్దం కలిసి ఆటో ఎప్పుడు దిగిపోతామా అని భయం భయంగా కూర్చోవాలి. గంటల తరబడి కబుర్లు చెప్పుకుంటూ కూర్చుంటారు; ముగ్గురేసీ, నలుగురేసీ డ్రయివర్లు: ఆటోలు నిలబెట్టి. అంతేగాని బేరం కట్టుకోరు. మీటరు మీద రూపాయో రెండో అడిగితే ఇవ్వలేదని అలా ఉన్నచోటే ఉండిపోతారు. లంచి టైముకి ఎవరో కేరేజీలో భోజనం తెచ్చిస్తారు గావును - అనిపిస్తుంది. ఏ సిండియాకో రమ్మంటే అట్నుంచి బేరం ఉండదు గనుక రానుపోనూ ఛార్జి యిచ్చీమంటారు. తీరా ఏదో బేరం కుదుర్చుకుని బయల్దేరితే చిల్లర బేరగాళ్లు ఒకరూ ఒకరూ వచ్చి మనం మాట్లాడుకున్న ఆటోలో ఎక్కి మనని రాడ్ మీదకి సెటిల్ చేసేసి వాళ్లు సీటు ఆక్రమిస్తారు. డ్రయివరు తన పక్కని ఒకణ్ణి కూర్చోబెట్టుకుంటాడు. కొన్ని చోట్ల స్టాండు మామూళ్లు ఉంటాయి. మనం ఆటో బేరం చేసుకుని కూచున్నాక ఒక దృఢమైన మనిషి వొచ్చి “టూ రుపీస్ ఇలా కొట్టండి సార్!” అంటాడు. జగదాంబా నుంచి జిల్లా పరిషత్‌కో, ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సిరిపురానికో వెళ్లాలంటే అంతా అప్ కదా; అంచేత రెండు రూపాయలు ఎగ్స్ట్రా ఇవ్వాలంటారు. సామానో సంసారమో మనతోబాటు వుంటే మన పాట్లు కుక్కలు పడవు. మీ వూళ్లో ఆటోలు ఎక్కుతున్న వాళ్లు ఆపదలో గాని తెగింపులో గాని, తొందర పన్ల మీద గాని ఉండేవాళ్లే ఎక్కువ. వెరసి, ఈ వూళ్లో ఆటోలు ఎత్తెయ్యడం నయం అన్న పరిస్థితి”.

“మరి ఆ డ్రయివర్లంతా ఎలా బతుకుతారు?”

“తలా వొక దుడ్డుకర్ర పుచ్చుకుని పది రూపాయలిస్తావా, బుర్రబద్దలు కొట్టమంటావా అని దౌర్జన్యం చేసి బతకొచ్చు, ఇలా రీజనింగుకి అందకుండా తిరిగే బదులు... ఆటో జనం మీద ఇతర జనానికి ఇప్పుడూ ఎప్పుడూ సానుభూతి వుండదు.”

ఈ వారం అంతా విశాదపట్నంలో ఆటోలు తిరగలేదు. “మొగుణ్ణి కొట్టి మొగసాల కెక్కినట్టుంది” అన్నాడు నిన్న రైలు దిగిన మోహనరావు. “చెరువుమీద అలిగితేను చెడేదెవ్వరు” అని ఈలతో పాట అందుకున్నాడు.

★